నూతన మున్సిపాలిటీ ఏర్పాటుతో సంబరాలు



మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎల్లంపేట్‌ నాయకులు

మేడ్చల్‌: మండలంలోని అన్ని గ్రామాలను కలిపి ఎల్లంపేట్‌ కేంద్రంగా నూతన మున్సిపాలిటీ ఏర్పాటు చేయడంతో ఎల్లంపేట్‌ నాయకులు సంబరాలు నిర్వహించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ వజ్రేష్‌యాదవ్‌, నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్‌లను కలిసి సన్మానించారు. మాజీ సర్పంచ్‌ రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ కుమార్‌యాదవ్‌, మాజీ మర్కెట్‌ కమిటీ చైర్మన్‌ సత్యనారాయణ, నాయకులు శంకర్‌, సంతోష్‌, మహేష్‌ తదితరులున్నారు.

ప్రవీణ్‌ పగడాల మృతిపై విచారం..

దమ్మాయిగూడ క్రిస్టియన్‌ సెల్‌ అధ్యక్షుడు హర్షవర్ధన్‌



కీసర: పాస్టర్‌ ప్రవీణ్‌ పగడాల మృతిపై విచారం వ్యక్తం చేస్తున్నామని దమ్మాయిగూడ క్రిస్టియన్‌ సెల్‌ అధ్యక్షుడు డాక్టర్‌ పల్లే హర్షవర్ధన్‌ అన్నారు. బుధవారం ఆయన దమ్మాయిగూడలో మాట్లాడుతూ.. ప్రవీణ్‌ పగడాల అకాల మరణంపై పూర్తి విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్‌ చేశారు. పాస్టర్‌ ఫిలిప్‌ మాదాసు, కమిటీ సభ్యులు రెవరెండ్‌, పాల్‌డేవిడ్‌ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



మంజుల

జవహర్‌నగర్‌: ఓ మహిళ అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్‌ గబ్బిలాల్‌పేటలో నివసించే కొత్తపల్లి యాదగిరి, భార్య మంజుల (46), ఇద్దరు పిల్లలతో ఉంటున్నారు. గత కొంతకాలంగా మంజుల మానసిక వ్యాధితో బాధపడుతూ ఇంటి వద్దే ఉంటుంది. ఈనెల 20న కుమార్తె ఇంధుమతి ఇంటికొచ్చి చూసేసరికి తల్లి కనిపించలేదు. ఆచూకీ కోసం పలుచోట్ల వెతికినా లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ధర్మభిక్షం ఆశయసాధనకు కృషి చేయాలి



నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు

జవహర్‌నగర్‌: ప్రజల మనిషి ధర్మభిక్షం ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ మేడ్చల్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి తోటపల్లి శంకర్‌ అన్నారు. జవహర్‌నగర్‌ కార్పొరేషన్‌ గిరి ప్రసాద్‌నగర్‌ సీపీఐ పార్టీ కార్యాలయంలో బుధవారం కాప్రా సీపీఐ అధ్యక్షుడు దర్శనం యాదగిరి ఆధ్వర్యంలో కామ్రేడ్‌ ధర్మభిక్షం వర్ధంతిని నిర్వహించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సత్యం, రాజేశ్వరి, స్వరూప, ఎల్లయ్య, కొమురయ్య, కవిత, అనసూయ, మల్లిక తదితరులున్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటెప్పుడు ?

- పేద విద్యార్థుల చదువుకు ఆటంకం
- స్పందించని అధికారులు, ప్రజాప్రతినిధులు



ఘట్‌కేసర్‌లో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని విద్యార్థుల ధర్నా (ఫైల్‌)

ఘట్‌కేసర్‌: నియోజకవర్గంలో అత్యధిక ఓటర్లు ఉన్న ఉమ్మడి ఘట్‌కేసర్‌ మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో పేద విద్యార్థుల చదువుకు ఇబ్బంది కలుగుతుంది. ఇంటర్మీడియట్‌ వరకు చదివిన విద్యార్థులు స్థానికంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో వారు డిగ్రీ విద్యకు దూరం అవుతున్నారు.

నిరాశే ఎదురవుతోంది..

ఉమ్మడి మండల విద్యార్థులే కాకుండా యాదాద్రి జిల్లా సరిహద్దు మండలాలకు చెందిన వందలాది మంది ఘట్‌కేసర్‌లో ఇంటర్‌ చదువుతున్నారు. అనంతరం డిగ్రీ చదువుకుందామని భావించిన విద్యార్థులకు నిరాశే ఎదురవుతోంది.

మాట తప్పిన ప్రభుత్వం....

ఘట్‌కేసర్‌ ఉమ్మడి మండలంలో ప్రైవేటు ఇంటర్‌ కళాశాలల్లో చదివిన విద్యార్థులు డిగ్రీ చదువుకుందామంటే ఆర్థిక పరిస్థితి సహకరించడం లేదు. దీంతో మధ్యతరగతి తల్లితండ్రులు తమ పిల్లలను స్థానిక, నగరంలోని ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో చేర్పిస్తున్నారు. ఆ స్తోమత లేని వారు ప్రైవేటుగా చదివించలేక ఇంటర్‌ వరకే చదువును మాన్పిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన అనంతరం అప్పటి మేడ్చల్‌ ఎమ్మెల్యే విన్నపం మేరకు కళాశాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2014లో గురుకుల్‌ జూనియర్‌ కళాశాల ఆవరణలో డిగ్రీ కళాశాలను స్థాపించాలని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. దశాబ్దకాలమైన డిగ్రీ కళాశాల ఏర్పాటు కాకపోవడంతో ప్రభుత్వ యంత్రాంగం, పాలకులు పనితీరు తేటతెల్లమైంది.

- పేద విద్యార్థులకు డిగ్రీ కళాశాల చదువు మాత్రం నీటిమీద రాతలుగానే మిగిలిపోయింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి స్థానికంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలి...



ప్రైవేటులో చదువుకున్న వారందరూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుకుందామని కంటున్న కలలు కలగానే మిగిలిపోతున్నాయి. విద్యార్థులు ఎన్ని పోరాటాలు చేసిన అధికారులు, నాయకుల్లో స్పందన రావడం లేదు. స్థానికంగా డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలి.

– కందకట్ల ప్రతాపరెడ్డి, ఇంటర్‌ విద్యార్థి

ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదు...



దశాబ్దకాలంగా పేద విద్యార్థులు డిగ్రీ కళాశాల కోసం ఎదురు చూస్తున్నారు. ఆర్థికంగా వెనకబడిన విద్యార్థులు ఇంటర్‌ వరకు చదువును ఆపేస్తున్నారు. డిగ్రీ కళాశాల ఏర్పాటుపై ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదు.

–విప్పర్ల హనుమాన్‌, ఘట్‌కేసర్‌ మున్సిపాలిటీ

పేద విద్యార్థులు వెనుకబడిపోతున్నారు..



స్థానికంగా డిగ్రీ కళాశాల లేకపోవడంతో పేద విద్యార్థులు చదువులో వెనకబడుతున్నారు. పేద విద్యార్థుల కోసం డిగ్రీ విద్యను అందుబాటులోకి తీసుకురావాలి. దీనిపై ప్రజా ప్రతినిధులు స్పందించాలి.

– కొమ్మిడి శోభారాణి, అంకుషాపూర్‌

అవుషాపూర్‌లో పోస్టాఫీస్‌ ప్రారంభం



పోస్టాఫీస్‌ ఖాతాబుక్‌ను అందజేస్తున్న అధికారి సుబ్రహ్మణ్యం, ప్రజా ప్రతినిధులు

ఘట్‌కేసర్‌: అవుషాపూర్‌లో నూతనంగా పోస్టాఫీస్‌ను ఏర్పాటైంది. ముఖ్యఅతిథిగా పోస్ట్‌ ఆఫీసర్‌ సుబ్రహ్మణ్యం, మున్సిపల్‌ మాజీ చైర్‌పర్సన్‌ పావనీజంగయ్య, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌ కావేరితో కలిసి బుధవారం పోస్టాఫీస్‌ను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కార్యాలయం ప్రారంభించామని, సీనియర్‌ సిటిజన్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. డీసీసీ కార్యదర్శి ఆంజనేయులుయాదవ్‌, కాంగ్రెస్‌ మున్సిపల్‌ ఉపాధ్యక్షుడు నాగరాజ్‌ముదిరాజ్‌, మాధవరెడ్డి, యూత్‌ కాంగ్రెస్‌ మున్సిపల్‌ అధ్యక్షుడు సంజీవరెడ్డి, మల్లేష్‌, రవీందర్‌, వెంకట్‌రెడ్డి, శంకర్‌గౌడ్‌, సల్మాన్‌, మల్లేష్‌యాదవ్‌, చిన్నయాదవ్‌, సూపరింటెండెంట్‌ శ్రీనివాస్‌, ఏఎస్‌పీఆర్‌ విష్ణుజ్యోతి, అసిస్టెంట్‌ సూపరింటెండెంట్‌ వెంకన్న, ఇన్‌స్పెక్టర్‌ తిరుపతి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీలకు రాజీవ్‌ యువ వికాసం పథకం

మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి ఝాన్సీరాణి

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లాలోని నిరుద్యోగ యువతీ,యువకులకు స్వయం ఉపాధి అవకాశాల ద్వారా ఆర్థిక పురోగతి పెంపొందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన రాజీవ్‌ యువ వికాసం' పథకాన్ని ప్రకటించిందని బీసీ అభివృద్ధిశాఖ జిల్లా అధికారి ఝాన్సీరాణి తెలిపారు. అర్హత 21–55 ఏళ్ల (01 జూలై 2025 నాటికి) కలిగి ఉన్న అభ్యర్థులు మాత్రమే ఉపాధి హామీ పథకాలకు అర్హులన్నారు. 21–60 ఏళ్లున్న అభ్యర్థులు భూ సంబంధ, ఉద్యాన, వ్యవసాయ పరికరాల పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థి సంవత్సర ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షలు, పట్టణ/ మున్సిపాలిటీ ప్రాంతాల వారికి రూ.2 లక్షలు మించి ఉండకూడదన్నారు. దరఖాస్తుదారులు సూచించిన ధ్రువపత్రాలను జతపరచాల్సి ఉంటుందన్నారు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు లేదా ఆదాయ ధ్రువపత్రం, కుల ధ్రువీకరణపత్రం (తెలంగాణ ఏర్పడిన తర్వాత జారీ చేసినది మాత్రమే), డ్రైవింగ్‌ లైసెన్స్‌ (రవాణా రంగం వారికి మాత్రమే), పట్టాదార్‌ పాస్‌బుక్‌ (వ్యవసాయరంగం వారికి మాత్రమే), సదరం సర్టిఫికెట్‌ (దివ్యాంగులకు మాత్రమే) ప్రతులతో సహా పాస్‌పోర్ట్‌ సైజు ఫోటోను దరఖాస్తుతో జతపరచాలని ఆమె సూచించారు. మీ–సేవ నుంచి ధ్రువపత్రాలు.. మీ–సేవ నుంచి పొందినవి మాత్రమే అంగీకరించబడతాయని స్పష్టం చేశారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్‌ పోర్టల్‌ ద్వారా ఏప్రిల్‌ 5 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు కలెక్టరేట్‌లోని మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఆస్తిపన్ను 'ఓటీఎస్‌' వడ్డీ రాయితీ పెంపు

కీసర : మున్సిపల్‌ అడ్మినిస్ట్రేషన్‌ అండ్‌ అర్బన్‌ డెవలప్‌మెంట్‌ డిపార్ట్‌మెంట్‌, శాఖ ఆధ్వర్యంలో 2024–2025 ఆర్థిక సంవత్సరం వరకు రాష్ట్రంలోని అన్ని పట్టణ, స్థానిక సంస్థల్లో వన్‌టైమ్‌ సెటిల్‌మెంట్‌(ఓటీఎస్‌) కింద ఆస్తిపన్ను వడ్డీ బకాయిల్లో 90 శాతం రాయితీ ఉత్తర్వులు జారీ చేసిందని, దమ్మాయిగూడ మున్సిపల్‌ కమిషనర్‌ నాగమణి అన్నారు. దమ్మాయిగూడ మున్సిపల్‌ పరిధిలో ఉన్న ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. దమ్మాయిగూడ మున్సిపల్‌ పరిధిలో ఇంటిపన్నులు, పాత బకాయిలు ఉన్నవారు త్వరగా మున్సిపల్‌ కార్యాలయానికి వచ్చి పన్నులను సకాలంలో చెల్లించి వడ్డీ రాయితీని పొందాలని ఆమె సూచించారు.

ఇంటి పన్నులు చెల్లించాలి..

జవహర్‌నగర్‌: జవహర్‌నగర్‌ కార్పొరేషన్‌ పరిధిలోని ప్రజలు తమ ఇంటిపన్నులు చెల్లించాలని కమిషనర్‌ వసంత బుధవారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. ఈ మేరకు గతేడాది బకాయిలను ఒకేసారి చెల్లించి 90 శాతం వడ్డీ మాఫీని పొందవచ్చని స్పష్టం చేశారు. ప్రతి వార్డులో బిల్‌ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు, ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

'హామీలు అమలు చేయని ప్రభుత్వం'



కొకుట్ల చంద్రారెడ్డి

కీసర: ప్రజలకు మేలు చేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అనుసరిస్తోందని బీజేపీ సీనియర్‌ నేత, నాగారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్‌ కొకుట్ల చంద్రారెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో అమలు కాని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రజలకు మేలుచేసేది పోయి, వారిపై ఆర్థికభారం పడేలా చర్యలు చేపడుతుందన్నారు. గతంలో కాంగ్రెస్‌ తమ పార్టీ అధికారంలోకి వస్తే ఉచితంగా ఎల్‌ఆర్‌ఎస్‌ స్కీమ్‌ను అమలు చేస్తామని గొప్పలు చెప్పిందన్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎల్‌ఆర్‌ఎస్‌ పేరిట పేద, మధ్యతరగతి ప్రజలతో పాటు బిల్డర్ల నుంచి ముక్కుపిండి ఎల్‌ఆర్‌ఎస్‌ ఫీజును వసూలు చేయడం సరికాదన్నారు. నాగారం మున్సిపాలిటీ విషయానికి వస్తే ఇక్కడ ఒక ప్లాట్‌ రెగ్యులరైజేషన్‌ చేసుకోవాలంటే రూ.2–3 లక్షలు ఫీజు చెల్లించాల్సి వస్తుందని దీంతో చిన్న ప్లాట్‌ను కొనుగోలు చేసిన పేదలకు ఆర్థికంగా ఎంతో భారం పడుతుందన్నారు. ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్‌ విషయంలో ప్రజలకు మేలుచేసేలా నిర్ణయం తీసుకోవాలని డిమాండ్‌ చేశారు.

రాజీవ్‌ యువ వికాసం పథకాన్ని అమలు చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్‌ రాధికాగుప్తా

సాక్షి,సిటీబ్యూరో: రాజీవ్‌ యువ వికాసం పథకం కార్యక్రమం ద్వారా ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్‌ అర్హులకు ఉపాధి అవకాశాలను కల్పించాల్సిన అవసరం ఉందని మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్‌ రాధికాగుప్తా తెలిపారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. రాజీవ్‌ యువవికాసం కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేసేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలని రాధికాగుప్తా పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులు వినోద్‌ కుమార్‌, ఝాన్సీరాణి తదితరులున్నారు.

30 రోజుల వేసవి శిక్షణ శిబిరాలు

జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారి గోపాల్‌రావు

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్‌, మల్కాజిరి జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో మే 01 నుంచి 31 వరకు 14 ఏళ్ల లోపు ఉన్న బాలబాలికలకు ఉచిత వేసవి శిక్షణ శిబిరాల(క్రీడలు)ను నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారి గోపాల్‌రావు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 28 వరకు మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి కార్యాలయంలో నేరుగా దరఖాస్తులను అందజేయాలన్నారు.

ఆటోస్టాండ్‌ వద్ద చలివేంద్రం ఏర్పాటు చేయొద్దని వినతి



మున్సిపల్‌ కమిషనర్‌ను కలిసిన ఆటోడ్రైవర్లు

మేడ్చల్‌: పట్టణంలోని అంబేడ్కర్‌ విగ్రహం సమీపంలో రోడ్డు పక్కన ఏర్పాటు చేస్తున్న చలివేంద్రాన్ని ఏర్పాటు చేయొద్దని ఆటో డ్రైవర్లు మున్సిపల్‌ కమిషనర్‌ నాగిరెడ్డిని కోరారు. పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు నడుస్తుండటంతో రోడ్డు చిన్నగా మారిందని, అంబేడ్కర్‌ విగ్రహం వద్ద ఆటోలు నిలిపేందుకు స్థలం సరిపోవడం లేదన్నారు. రోడ్డు పక్కన చలివేంద్రం ఏర్పాటు చేస్తే ఆటోలు, ప్రయాణికులకు ఇబ్బందిగా ఉంటుందని వారు కమిషనర్‌కు వివరించారు. ఎవరికి ఇబ్బంది లేనిచోట చలివేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఆటోడ్రైవర్లు విజయరావు, నాగేందర్‌, దుర్గపతి, ఇస్మాయిల్‌, గణేష్‌ తదితరులున్నారు.

బస్టాండ్‌లో లారీలు !

ఇబ్బందుల్లో ప్రయాణికులు



మేడ్చల్‌ బస్టాండ్‌లో పార్క్‌ చేసిన లారీలు

మేడ్చల్‌: నిబంధనలకు వ్యతిరేకంగా రోడ్లపై నడుస్తున్న లారీలను ఆర్టీఏ అధికారులు సీజ్‌చేసి మేడ్చల్‌ డిపోలో పార్కింగ్‌ చేయిస్తుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీఏ అధికారులు మేడ్చల్‌లో జాతీయ రహదారిపై వాహనాల తనిఖీలు చేసి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న లారీలను సీజ్‌ చేశారు. భారీ లారీలను మేడ్చల్‌ డిపో, డిపో ఆవరణలో పార్కింగ్‌ చేయించారు. ఓ వైపు లారీలు, మరోవైపు బస్సులు బస్టాండ్‌ మొత్తం గజిబిజిగా మారడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. బస్టాండ్‌ ఆవరణలో ప్రైవేటు వాహనాలు నిలపకుండా తగిన చర్యలు తీసుకోవాలని మేడ్చల్‌ డిపో ఆర్టీసీ అధికారులు కోరుతున్నారు. ప్రైవేటు వాహనాలు డిపో లోపలికి అనుమతి ఉండదు. దీనిపై ఆర్టీసీ సిబ్బంది సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టడం గమనార్హం.

29న తైబజార్‌ వేలం

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలో 2025–2026కు సంబంధించి తైబజార్‌ వేలం పాటను ఈనెల 29న ఉదయం 12.30 గంటలకు మున్సిపల్‌ కార్యాలయం వద్ద నిర్వహించనున్నట్లు మున్సిపల్‌ కమిషనర్‌ భాస్కర్‌రెడ్డి ప్రకటించారు. బుధవారం ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. తైబజార్‌ వేలంపాటలో పాల్గొనాలనుకునే వారు ఉదయం 11.30 గంటల లోపు దారవత్తు రూ.2,00,000 మున్సిపల్‌ కమిషనర్‌ నాగారం పేరిట డీడీ లేదా నగదు ఉదయం 11.30 లోపు చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు.

మహిళ అదృశ్యం



సంగీత (ఫైల్‌)

మేడ్చల్‌రూరల్‌: ఓ మహిళ అదృశ్యమైన ఘటన మేడ్చల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై అశోక్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌ రాష్ట్రానికి చెందిన సౌరభ్‌ మెహ్రా భార్య సంగీత పటేల్‌ (24)తో కలిసి కండ్లకోయలో నివాసం ఉంటున్నారు. ఈనెల 20న ఉదయం సౌరబ్‌ మెహ్రా పనికి వెళ్లగా భార్య ఇంట్లోనే ఉంది. రాత్రి భర్త పని నుంచి తిరిగి ఇంటికొచ్చేసరికి భార్య కనిపించకపోవడంతో భర్త మేడ్చల్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తడి, తాలుపై రైతులను చైతన్యపరచాలి

వ్యవసాయశాఖ అధికారులకు జిల్లా అదనపు కలెక్టర్‌ విజయేందర్‌రెడ్డి ఆదేశం



సాక్షి,సిటీబ్యూరో: రైతులు వరి ధాన్యాన్ని తడి,తాలు, దుమ్ము లేకుండా కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చేలా చైతన్యపరచాలని జిల్లా అదనపు కలెక్టర్‌ (రెవెన్యూ) డి.విజయేందర్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం మేడ్చల్‌ కలెక్టరేట్‌లో యాసంగి 2024–25 కాలానికి సంబంధించి 'ధాన్యం సేకరణ'పై కేంద్రాల ఇన్‌చార్జ్‌లు, రైస్‌ మిల్లుల యజమానులతో ఆయన సమావేశం నిర్వహించారు. పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్‌ సుగుణబాయి, వ్యవసాయశాఖ జిల్లా అధికారి చంద్రకళ, జిల్లా సహకారశాఖ అధికారి వెంకట్‌రెడ్డి, సహకార సంఘాల చైర్మన్లు పాల్గొన్నారు. అదనపు కలెక్టర్‌ మాట్లాడుతూ.. వరికోత సమయంలో వరి నూర్పిడి యంత్రాల వారితో మాట్లాడి ఓ క్రమపద్ధతిలో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

సన్న వడ్లు, దొడ్డు వడ్లను వేరుచేసి..

ఒకే కేంద్రంలో సన్న వడ్లు, దొడ్డు వడ్లకు ప్రత్యేక విభాగాలను ముందస్తుగా ఏర్పాటు చేయాలన్నారు. వాటి లోడులను కూడా వేర్వేరుగా రైస్‌ మిల్లులకు పంపాలన్నారు. ఈ మేరకు రిజిస్టర్లను కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ప్రభుత్వ నియమాల ప్రకారం అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని ఆయన ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవడంతో పాటు వారు విక్రయించిన ధాన్యం డబ్బులు 48 గంటల్లో నేరుగా వారి ఖాతాలో జమ చేయాలన్నారు. అధికారులు సమష్టిగా పనిచేసి జిల్లా, ప్రభుత్వానికి ధాన్యం కొనుగోళ్ల విషయంలో మంచిపేరు తీసుకురావాలని సూచించారు.

ముగిసిన మేడ్చల్‌ గ్రామాల కథ !

గ్రామాలు లేని నియోజకవర్గంగా మేడ్చల్‌

పదేళ్ల క్రితం వరకు సంపూర్ణ గ్రామీణ నియోజకవర్గంగా ఉన్న మేడ్చల్‌ను 10 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్లు, 7 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్లను గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ఏర్పాటు చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం 3 మున్సిపాలిటీలను ఏర్పాటు చేసింది. దీంతో మేడ్చల్‌ పూర్తిగా గ్రామాలు లేని నియోజకవర్గంగా మారింది. మొత్తం 61 గ్రామాలు మున్సిపాలిటీలలో విలీనమయ్యాయి.

మేడ్చల్‌: తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించకముందు నియోజకవర్గం పూర్తిగా దాదాపు 82 గ్రామాలతో నియోజకవర్గం ఉండేది.

అన్నీ గ్రామాలే..

మేడ్చల్‌, శామీర్‌పేట్‌, ఘట్‌కేసర్‌, కీసర మండలాలు ఉండేవి. ఒక్క మున్సిపాలిటీ ఉండేది కాదు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ఏర్పడ్డాక 4 మండలాలతో పాటు మూడు చింతలపల్లిని మండలంగా ఏర్పాటు చేసింది. మేడ్చల్‌, గుండ్లపోచంపల్లి, తూంకుంట, నాగారం, దమ్మాయిగూడ, పోచారం, ఘట్‌కేసర్‌ మున్సిపాలిటీలను, జవహర్‌నగర్‌, బోడుప్పల్‌, పీర్జాదిగూడ కార్పొరేషన్లను ఏర్పాటు చేసింది.

అర్బన్‌ ప్రాంతంగా మేడ్చల్‌..

కాంగ్రెస్‌ ప్రభుత్వం నియోజకవర్గంలో మూడు మున్సిపాలిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు అసెంబ్లీలో ప్రకటించడంతో మేడ్చల్‌లో గ్రామాల కథ ముగిసింది. కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చాక కొన్ని గ్రామాలను సమీప మున్సిపాలిటీలలో విలీనం చేయడం, తాజాగా మూడు చింతలపల్లి, అలియాబాద్‌, ఎల్లంపేట్‌ గ్రామాలను కేంద్రంగా చేస్తూ గ్రామాలన్నీ మున్సిపాలిటీల్లో విలీనం చేయడంతో మేడ్చల్‌ అర్బన్‌ ప్రాంతంగా మారనుంది. మేడ్చల్‌లో మొత్తం 10 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్ల ద్వారా భవిష్యత్తులో పాలన సాగనుంది.


ఆ రెండింటి చరిత్ర కనుమరుగు...

గతంలో మండల కేంద్రంగా మేడ్చల్‌, ఘట్‌కేసర్లు.. తాజాగా మున్సిపాలిటీల కేంద్రంగా ఉన్నాయి. మండల కేంద్రాలుగా ఉన్న కీసర, శామీర్‌పేట్‌లు ప్రత్యేక మున్సిపాలిటీలుగా కాకుండా విలీనం కావడంతో వాటి చరిత్ర కనుమరుగు కానుంది.

- కీసర నాగారంలో విలీనం కాగా, శామీర్‌పేట్‌ తూంకుంటలో విలీనమైంది. ఎంతో చరిత్ర గడించిన కీసర, శామీర్‌పేట్‌లు కనీసం మున్సిపల్‌ కేంద్రాలుగా కూడా లేకపోవడంతో వాటి చరిత్రకు ఫుల్‌స్టాప్‌ పడ్డట్టే.
- మిగతా ప్రాంతాలతో పోలిస్తే కీసర, శామీర్‌పేట్‌లు మండల కేంద్రాలుగా ఉన్నా.. అభివృద్ధిలో వెనుకడుగులో ఉన్నాయి.
- కనీసం నూతన మున్సిపాలిటీల కేంద్రాలుగా ఉంటే అభివృద్ధి చెందుతాయని అక్కడి ప్రజలు ఆశిస్తున్నారు.

అంతా గత చరిత్రే..

గ్రామీణ ప్రాంతంగా ఉన్న సమయంలో మేడ్చల్‌ నియోజకవర్గంలో రాజకీయం చేస్తున్న వారు వార్డు మెంబర్‌ స్థాయి నుంచి ఎదిగిన వారే ఉన్నారు. వార్డుమెంబర్‌, సర్పంచ్‌, ఉపసర్పంచ్‌, ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీ ఇలా కిందస్థాయి నుంచి ఎదిగిన నాయకులు నేడు వివిధ పార్టీల్లో అగ్ర నాయకులుగా ఉన్నారు. మున్సిపాలిటీల ఏర్పాటుతో వారి చరిత్ర అంతా గత చరిత్రగా మారనుంది.



మేడ్చల్‌ నియోజకవర్గం

ఇప్పటికీ గ్రామీణ వాతావరణమే..

మేడ్చల్‌ నియోజకవర్గం హైదరాబాద్‌ నగరానికి అత్యంత దగ్గరగా ఉన్నా ఇప్పటికి చాలా ప్రాంతాలు గ్రామీణస్థాయిలోనే ఉన్నాయి. గిరిజన తండాలు, అనుబంధ గ్రామాలు ఇంకా వెనుకబడే ఉన్నాయి. మెజార్టీ గ్రామాల్లో ప్రజలు వ్యవసాయం చేస్తూ పాడి, పశుసంపదలపైనే అధారపడి జీవిస్తున్నారు.

- ప్రభుత్వం భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని గ్రామీణ ప్రాంతాలను అర్బనైజ్‌ చేయడంతో గ్రామాల పరిస్థితి ఎంత వరకు మారుతుందనే దానిపై చర్చ జరుగుతోంది. ప్రభుత్వాల నిర్ణయాలతో మేడ్చల్‌ నియోజకవర్గం అభివృద్ధి కంటే వేగంగా పాలన వ్యవస్థలో మార్పు చెందుతుంది.